



# రేపటి సూర్యుడు

- కేశిరాజు ఫణిప్రసాద్

*(గత సంచిక తరువాయి)*

"ఒద్దు సార్, కాఫీ, టీ తాగటం నాకు అలవాటు లేదు. మీరు అభిమానంగా అడుగుతున్నారని ఇప్పుడు మీతో కాఫీ తాగాననుకోండి. రేపు మళ్లీ ఇదే టైముకి కాఫీ త్రాతాగాలనిపిస్తుంది. రేపు ఒక్క రోజు అనుకుంటూ తాగుతాను. అటు తరువాత కాఫీ తాగాలనిపిస్తూంటుంది. ప్రతి రోజూ కాఫీ కోసం డబ్బు ఖర్చుపెట్టేంత స్తోమత లేదు. నేను రాను కూడా. అందుకే ముందే వద్దనుకోవటం ఎప్పటికైనా మంచిదే కదండీ!"

సూర్యం మాటలు వినగానే నాలో ఒక జాలి, మరో పక్క ఆశ్చర్యం! పైకి ఏమీ మాట్లాడకుండా అతన్ని దగ్గరలో వున్న ఒక పార్కులోకి తీసుకువెళ్లాను. ఇద్దరమూ ఒక పార్కులో కూర్చున్నాం.

"సూర్యం, నువ్వు నాతో మనసు విప్పి మాట్లాడాలి. ఏ విషయమూ దాచకూడదు. ఎందుకంటే నీ గురించీ, మీ కుటుంబ పరిస్థితుల గురించీ, తెలుసుకోవాలనుకుం టున్నాను" మాటల్లో ఆత్మీయతాభావం వ్యక్తం చేశాను.

ఒక్క క్షణం నన్ను చూశాడు. తరువాత అతను మాట్లాడటం మొదలెట్టాడు.

"నేను టెన్తు క్లాసు ఫస్ట్ క్లాసులో పాసయ్యాను. ఈ రిజల్ట్సు పేపరులో పడిన రోజు, మా అమ్మ ఎంతో సంతోషించి, ఆ వేళ ప్రత్యేకంగా నా కోసం మైసూర్ పాక్ చేసి పెట్టింది. మైసూర్ పాక్ నాకెంతో ఇష్టం. ఆ రోజునే మా నాన్నగారు తన ఆఫీసుకి కూడా మైసూర్ పాక్ పట్టుకెళ్లి కొలీగ్స్‌తో నా విషయం చెప్పి అందరికీ ఇచ్చారు. ఆఫీసులో వాళ్లందరూ నాన్నగారిని అభినందించారు. వాళ్ల ఆఫీసరు గారు, ప్రత్యేకంగా పిలిపించుకుని కంగ్రాట్యులేషన్ చెప్పారు. 'ఇంత ఆనందం, తృప్తి పొందిన నాకు ఇంకేం కావాలి?' అని నాన్న గారు ఇంటి కొచ్చాక, ఒకటికి రెండు సార్లు మాతో అన్నారు."

అనుకోకుండా నేను సూర్యం మాటలు వింటూ అతని చేతిని ఆప్యాయంగా పట్టుకున్నాను.

"మరో మూడునాలుగు రోజుల తరువాత మా స్కూలు హెడ్మాస్టరు పొద్దున్నే మా ఇంటికొచ్చారు. 'వెంకటరామయ్య గారూ, మీ అబ్బాయి మా స్కూలుకి ఫస్టొచ్చాడు. మెరిట్‌లో పాసైన మా పిల్లల ఫోటోలు పేపర్లో వేయించాం' అంటూ, పేపరు చూపించారు. 'ఒరేయ్ సూర్యం. నీకెంతో భవిష్యత్తు ఉందిరా!' మాస్టారి ఆశీర్వాదం జీవితంలో నాకు అపురూపమైన అనుభూతి."

సూర్యం మాట్లాడుతుంటే చూస్తూన్నాను. ఆ క్షణంలో కళ్లలో సంతోషపు వెన్నెల! తల్లిదండ్రుల మనసును అర్థం చేసుకున్నవాడే కొడుకు. అటువంటి కొడుకునే ప్రస్తుతం సూర్యంలో చూస్తూ ఎంతో సంతోషిస్తున్నాను. సూర్యం తల్లిదండ్రులను కలిసి తీరాలి. మనస్ఫూర్తిగా అభినందించాలి.

"సార్, నా మాటలు మిమ్మల్ని విసిగించటం లేదు కదా?"

అలా అడిగినతన్ని "బలేవాడివే. ఇంకా నీ గురించి తెలుసుకోవాలని అనుకుంటున్నాను!" ఒక్క క్షణం నేను మాట్లాడకుండా ఉండటంతో అతను అలాగనుకున్నాడు.

"ఎంతో బాగా చదివి స్కూలుకే మంచి పేరు తీసుకొచ్చిన నిన్ను చూసి, మిగతా నీ స్నేహితులంతా ఏమన్నారు?" మాట్లాడటానికి ప్రోత్సహిస్తూ, భుజం తట్టి అడిగాను.

సూర్యం వెంటనే మాట్లాడలేదు, మళ్లీ ఆలోచనల్లో పడ్డాడు. మళ్లీ అడిగాను.

"ఒరేయ్ సూర్యం, మనమందరం ఇన్నాళ్లు ఒకే స్కూల్లో చదువుకున్నాం. ఒక మంచి స్కూల్లో చదువుకున్నాం అన్న పేరు నీ ఒక్కడి వల్ల మాకందరికీ కూడా వచ్చింది. అందుకే నువ్వు చేరిన కాలేజీలోనే మేమందరం చేరి నీతోపాటే చదువుకుంటాం."

స్నేహితుల ఆదరణ, ఉపాధ్యాయుల అభినందన, తల్లిదండ్రుల

అభిమానం, ఆశీస్సులు, అన్నింటిని తనీ సొంతం చేసుకోగలిగిన సూర్యం ఎంతో అదృష్టవంతుడు! కాదు, ఈ అబ్బాయి ఈ తరానికి ఆదర్శం. అంతే కాదు, భావితరాలకి ఇతనొక స్ఫూర్తి అని అతనితో నేను చెప్పలేదు. కారణం ఏదైనా కావొచ్చు. అందుకే మనసులోనే ప్రశంసించాను.

"కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం కాబోతున్నాయి. ఊళ్లో అన్ని కాలేజీలూ ఎవరి అభివృద్ధినీ, వాళ్ల వాళ్ల స్తామతనీ బట్టి ప్రచారం చేసుకుంటున్నాయి. నేనూ, మా ఫ్రెండ్స్ ఒకే కాలేజీ నుంచి అప్లికేషన్స్ తెచ్చుకుని, సర్టిఫికెట్లు జత చేసి, కాలేజీలో ఇవ్వటానికి తయారుగా ఉన్నాం."

సూర్యం చెపుతున్న మాటలు వింటున్నకొద్దీ, నాలో కుతూహలం రెట్టింపు అవుతోంది. చూపు మరల్చకుండా అతని మాటలను ఆసక్తితో వింటున్నాను.

"సాయంత్రం ఎప్పుడవుతుండా అని ఎప్పుడవుతుందా అని నేను ఎదురుచూస్తున్నాను. ఎందుకంటే నాన్నగారు రాగానే, నేను చేరబోయే కాలేజీ పేరు చెప్పి ఆయన ఆశీస్సులు అందుకోవాలి. నాన్నగారు వచ్చారు, అందరం కలిసి భోజనం చేశాం. వరండాలో నాన్నగారు మడత మంచం మీద కూర్చుని ఉన్నారు. నాన్నగారు 'సూర్యం ఇలా రా, నీతో మాట్లాడాలి' అన్న పిలుపు పూర్తి కాకుండానే, ఆయన దగ్గరికి ఒక్క పరుగులో చేరుకున్నాను. 'నీ టెన్త్ క్లాసు సర్టిఫికెట్లు, మార్కుల కాగితం రెడీగా ఉన్నాయా?' అడిగారు. ఉన్నాయని తలూపి వాటిన్నింటిని జాగ్రత్తగా తీసుకొచ్చి నాన్నగారి చేతుల్లో పెట్టాను. అన్నింటినీ ఎంతో శ్రద్ధగా చూసి మళ్లీ నాకిచ్చేశారు.

" 'సూర్యం, వీటన్నింటినీ తీసుకుని రేపు నువ్వు....' అంటున్న నాన్నగారి మాటలకు మధ్యలో, 'కాలేజీలో ఇచ్చేస్తాను' ఎంతో ఉత్సాహంగా చెప్పాను. 'నన్ను పూర్తిగా చెప్పనీ!' నాన్నగారి మాటకు తలూపాను. 'నిన్ను నాతో పాటు మా యజమాని దగ్గరకి తీసుకెళ్లి ఆయన్ని నీకు పరియచం చేస్తాను. ఎందుకంటే నేను ఎంతో ప్రాథేయపడితే నీకు ఆయన ఉద్యోగం ఇప్పిస్తాన్నారు.' నాన్నగారి మాటలకు మనసు మొద్దుబారినట్లయింది. 'నిన్ను నేను కాలేజీలో చదివించలేను. అటు ఆఫీసులోనూ, ఇటు బయటా ఎన్నో అప్పులు ఉన్నాయి. అందుకు నువ్వు ఉద్యోగంలో చేరాలి."

ఆ మాటలకు మనసు ముక్కలైపోతోంది. ఎవరికి, నాకు. మరి సూర్యం పరిస్థితి? సూర్యం వైపు చూశాను. ఎటువంటి భావమూ కనిపించటం లేదు. పిల్లలు చదువుకోవాలనీ, వాళ్ల గురించి గొప్పలు చెప్పుకోవాలనీ ఉవ్విళ్లూరుతున్న తల్లిదండ్రులున్నారు. కాని చదువు మానేసి అప్పులు తీర్చమని శాసించిన తండ్రి మాటలకు, సూర్యం నిశ్శబ్దంగా ఉండిపోయాడా? అసలు ఎలా ఉండగలిగాడు?

ఇదే ఉద్దేశంతో సూర్యాన్ని ఒకటికిరెండు సార్లు అడిగాను. "ఎలా ఉండగలిగావు?" అనే మాటను నొక్కి పలుకుతూనే అడిగాను.

> *"నాన్న చెప్పాలనుకుంటున్న ముఖ్యమైన విషయం ఏమిటి? ఆరాటపడుతోంది హృదయం." ఎంతో అనునయంగా మాట్లాడుతూ, తన చేతకానితనాన్నీ, అనాలోచితమైన తన ప్రవర్తనూ కప్పిపుచ్చుకుంటున్న ఒక తండ్రి. అదీ కాక కన్న కొడుకు భవిష్యత్తు మీద బాధ్యతల వల విసురుతున్నాడు. అటువంటి తండ్రిని అసహ్యించుకుంటున్నాను. తండ్రి మాటలకు ప్రభావితమైపోతున్న కొడుకు. సూర్యాన్ని చూస్తూ అనుకుంటున్నాను.*
>
> *" 'ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్నాను, రెక్కలు ముక్కలవుతున్నాయి! ఇవ్వాళ కాదు, రేపు, అదీ కాదు మరి కొన్నాళ్లకైనా సుఖసంతోషాలను సొంతం చేసుకుందామనే ఆశ. బాధ్యతల బరువు మోసి నా గుండె బలహీనమైపోయింది. ఎప్పుడు ఈ గుండె ఆగిపోతుందోననే భయం. ఒక్కగానొక్క కూతురికి ఏ నాడూ ముద్దూ, ముచ్చటా తీర్చలేని తండ్రి. చివరకు పెళ్లి కూడా చెయ్యకుండా తన దారి తను చూసుకున్నాడు' అని, నేను పోయాక అయినవాళ్లూ, కానివాళ్లూ నన్ను తలో మాటా అంటూంటే...' నాన్న మాట్లాడలేని పరిస్థితి.*

అంతే! అతనిలో రకరకాల భావాలు ఒక్కసారిగా ఎగిసిపడుతున్నాయి. "సార్, నేను ఊరుకోలేదు. మా నాన్న నా సర్టిఫికెట్లు, మార్కుల కాగితాలను విసిరికొట్టాడు. అవి మామూలు కాగితాలు కాదు. కష్టపడి సంపాదించుకున్నవి. నా భావిజీవితానికి సంకేతాలు. ఓపికగా వాటిని కింద నుంచి తీసి మళ్లీ కవరులో పెట్టుకొన్నాను. 'నువ్వు చేసిన అప్పులు నువ్వే తీర్చుకో. నేను ఉద్యోగం చెయ్యను. ఎలాగైనా నేను చదువుకుంటాను!' గట్టిగా అరిచి కేకలు పెట్టి అప్పటికప్పుడు నేను ఇంట్లోంచి వెళ్లిపోయాను. నా స్నేహితులు నన్ను ఓదార్చి ఆశ్రయమిచ్చారు.

"మేమందరం కలిసి మా స్కూలు మాస్టారి దగ్గరికి వెళ్లి, జరిగిన విషయం ఆయనతో చెప్పాం. మాస్టారు, స్నేహితులతో కలిసి మా ఇంటికెళ్లాం. మాస్టారిని చూసి మా నాన్న, ఎంతో మర్యాదగా పలకరించారు. అది చూసిన నేనూ, మా స్నేహితులూ ఎంతో నమ్మకంగా ఉన్నాం. సందర్భం కలిసొచ్చిందని మాస్టారు నన్ను తప్పనిసరిగా చదివించమని మరీ మరీ చెప్పారు. 'మీరు చెప్పిన మాటని కాదంటున్నానని మీరు మరోలా అనుకోకండి. ఇంకా వాడిని చదివించే స్తోమత లేనివాడిని, నన్ను మన్నించండి' అంటూ, మాస్టారి ముందు చేతులు జోడించాడు.

"మరో మాట చెప్పలేని స్థితిలో మాస్టారు వెళ్లిపోయారు. కాని నాతో ఉన్న స్నేహితులు 'సూర్యాన్ని చందాలు వేసుకుని మేము చదివిస్తాం! అందుకైనా మీరు ఒప్పుకోండి' అంటూ పట్టుబట్టారు. ఎందుకో నన్నూ, నా స్నేహితులనీ, మా నాన్న తదేకంగా చూశాడు. ఒక్కమాట కూడా మాట్లాడకుండా ఉండిపోయాడు. నేనూ, మా వాళ్లూ అయోమయస్థితిలో ఉండిపోయాం.

" 'చూడండి అబ్బాయిలూ, మీ స్నేహితుడంటే మీకందరికీ ఉన్న అభిమానం నేను అర్థం చేసుకుంటున్నాను. కాదు ఇప్పుడే అర్థమవుతోంది. మా అబ్బాయితో కలిసి చదివినందుకే మీకు ఇంత అభిమానం ఉంటే, వాడిని కన్నతండ్రిని నాకెంతో అభిమానముంటుంది కదా! అది మీరందరూ అర్థం చేసుకోవాలి. మా అబ్బాయి చదువు గురించి మీరు నిశ్చింతగా ఉండండి.' మా నాన్న మాటలు విని స్నేహితులందరూ వెళ్లిపోయారు."

సూర్యం చెప్పిన విషయాలు ఎంతో ఆసక్తికరంగా ఉన్నాయి. అందరి తల్లిదండ్రులూ ఒకలాగే ఆలోచించరు. కొంత మంది స్వయంగా ఆలోచిస్తారు. మరి కొంత మంది మరొకరు చెప్పాక ఆలోచిస్తారు. ఆ చెప్పినవాళ్లు మంచి చెప్పినపుడు, వాళ్లు పెద్దవాళ్లా, చిన్నవాళ్లా అని అనుకోనక్కర్లేదు. సూర్యం వాళ్ల నాన్న స్వభావం గురించి నాలో కలిగిన ఆలోచన అది.

"సార్, తరువాత చదువు గురించి మా నాన్నతో మాట్లాడే అవకాశం లేకపోయింది."

సూర్యం మాటల్లోని అర్థం ఏమిటి? ఆలోచిస్తోంది నా మనసు. చదువుకోవాలి. ఎన్నెన్నో సాధించాలి అనుకుంటున్న కొడుకు. అక్కర్లేదు, అనవసరమైన ఆశలకు పోవద్దు, అనుకునే తండ్రి. అంతవరకు సూర్యం మాటలు విన్న నేను అనుకుంటున్నాను. ఎవరికైనా ఇలాగే అనిపిస్తుంది.


సూర్యం ఒక్కసారి నాకేసి చూశాడు. అతని చూపుల్లో ఎన్నో అర్థాలు. జరిగిన విషయం పూర్తిగా చెప్పలేదు. మాటలతో అతని కదిలించాను.

"మా స్నేహితుల ముందు మా నాన్న మాటలకి నేను సంతోషం పట్టలేక, కాస్సేపటికి నేను కూడా మా స్నేహితులతో నా సంతోషం పంచుకుంటూ, రాత్రి వరకూ వాళ్లతో ఉండిపోయాను. పది గంటల సమయంలో ఇంటికి చేరాను. ప్రతి రోజూ అయితే, ఆ టైములో మా నాన్న నిద్రపోతూంటాడు. కాని ఆ రోజు మా అమ్మ, నాన్న మాట్లాడుకుంటున్నారు. వాళ్లు నా గురించే మాట్లాడుకుంటున్నారు. ఇంటి అరుగు మీద కూర్చున్నాను. ఇద్దరి మాటలూ స్పష్టంగా విన పడుతున్నాయి. 'ఇపుడు వాడిని చదివించకుండా ఉద్యోగం చెయ్యమంటే వాడు ఒప్పుకుంటాడా?' అమ్మ మాట వినగానే ఉలిక్కిపడ్డాను! నాన్న నన్ను చదువుకోనివ్వడా? దిగులు మొదలైంది.

" 'అబ్బాయి చదువుకి అడ్డుపడుతున్నాననే బాధ నాకూ ఉంది. కాని వాడిని చదివించే స్తోమత నాకు లేదు' నాన్న మాట. 'చదువు మీద వాడెన్ని ఆశలు పెట్టుకున్నాడో మీకు తెలియదా?' అమ్మ మాటల్లో నా మనసు వ్యక్తమవుతోంది. 'ఆశలు ఉంటాయి కాని ఆశలు నెరవేర్చలేని నాలాంటి తండ్రులు కూడా ఉంటారు. మనం సామాన్యులం. పైగా పేదవాళ్లం. నా జీవితమంతా కష్టపడినా. నా భార్యాపిల్లల్ని సుఖపెట్టలేని అసమర్థుడిని. ఇన్ని సంవత్సరాల నుంచి ఉద్యోగం చేస్తూ ఒక పండగ రోజు కూడా. ఇంట్లోవాళ్లకి కొత్త బట్టలు కొనిచ్చానా? పిండివంటలతో భోజనం పెట్టగలిగానా?' కుమిలిపోతున్న నాన్న మనసు. ఇలా ఎన్నాళ్లు. ఎన్నేళ్లు. నావాళ్లకి చాలీ చాలని బ్రతుకు. ఒక్కగానొక్క కూతురు ఇంత వరకు పట్టు పరికిణీ కట్టుకోగలిగిందా? తన ఈడు పిల్లలు పుట్టిన రోజులు చేసుకుంటూ సంబరపడుతూంటే, తను కూడా అలా ఉండాలని ఆశపడకుండా ఉంటుందా?

" 'అవును, తనకి కూడా పుట్టిన రోజు జరపమని ఎప్పుడూ అమ్మాయి అడగలేదు.' చెల్లాయిని గురించి అమ్మ బాధపడుతోంది. చెల్లెలిని తలుచుకోగానే నా కళ్లు చెమ్మగిల్లాయి. 'ఈ రోజుల్లో పిల్లలు పెద్ద చదువులు చదవాలి. ఉద్యోగాలు చేస్తూ డబ్బు సంపాదించాలి. ప్రతి తల్లీ, తండ్రీ అనుకుంటారు. కాని నేను నా కొడుకు జీవితాన్ని చదవాలి, అధ్యయనం చేయాలి. వయసుకి చిన్నవాడైనా ఇప్పటి నుంచే ఏదో ఒక ఉద్యోగం చెయ్యాలి. మా ఇద్దరి సంపాదనతో ఈ ఇంట్లోవాళ్లు సంతోషంగా ఉండాలి. ఒక తండ్రిగా నా మనసును, కొడుకు అర్థం చేసుకోవాలని ఆశిస్తున్నాను.' నాన్న మాటలని శ్రద్ధగా వింటున్నాను. 'ఇదే సందర్భంలో మరో మాట కూడా చెప్పాలి' అంటున్న నాన్న మాట విని ఏమిటీ అని, ఆసక్తితో ఎదురుచూస్తున్నాను.

" 'ఇందులో నా స్వార్థం అంటూ ఏమీ లేదు. నా కొడుకు తెలివైనవాడు. చురుకైనవాడు. ఎప్పుడైనా చదువుకోగలడు. కాని ప్రస్తుతం ఎదిగిన మనసున్నవాడుగా నా ఆశ తీరిస్తే, నాకెంతో సహాయం చేసినవాడు అనే తృప్తి నాకు మరింత బలాన్నిస్తుంది. నువ్వు బాధపడనంటే మరో ముఖ్యమైన విషయం కూడా చెబుతాను...' అనుకోని ఉద్రేకంతో నాన్న మాట్లాడుతుంటే వింటున్న నేను, విలవిల్లాడిపోతున్న మనసుని అదుపులో పెట్టుకోవటానికి ఎంతో ప్రయత్నిస్తున్నాను.



"నాన్న చెప్పాలనుకుంటున్న ముఖ్యమైన విషయం ఏమిటి? ఆరాటపడుతోంది హృదయం."

ఎంతో అనునయంగా మాట్లాడుతూ, తన చేతకానితనాన్నీ, అనాలోచితమైన తన ప్రవర్తననూ కప్పిపుచ్చుకుంటున్న ఒక తండ్రి. అదీ కాక కన్నకొడుకు భవిష్యత్తు మీద బాధ్యతల వల విసురుతున్నాడు. అటువంటి తండ్రిని అసహ్యించుకుంటున్నాను. తండ్రి మాటలకు ప్రభావితమైపోతున్న కొడుకు. సూర్యాన్ని చూస్తూ అనుకుంటున్నాను.

" 'ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్నాను. రెక్కలు ముక్కలవుతున్నాయి! ఇవ్వాళ కాదు. రేపు. అదీ కాదు మరి కొన్నాళ్లకైనా సుఖసంతోషాలను సొంతం చేసుకుందామనే ఆశ. బాధ్యతల బరువు మోసి నా గుండె బలహీనమైపోయింది. ఎప్పుడు ఈ గుండె ఆగిపోతుందోననే భయం. ఒక్కగానొక్క కూతురికి. ఏ నాడూ ముద్దూ, ముచ్చటా తీర్చలేని తండ్రి. చివరకు పెళ్లి కూడా చెయ్యకుండా తన దారి తను చూసుకున్నాడు' అని, నేను పోయాక అయినవాళ్లూ, కానివాళ్లూ నన్ను తలో మాటా అంటూంటే....' నాన్న మాట్లాడలేని పరిస్థితి.

" 'చూడండి. మీకు దండం పెడతాను! ఈ నిండింట్లో అశుభం మాటలు మాట్లాడకండి!' అమ్మ దీనంగా అంటోంది.

సూర్యం మాట్లాడుతూంటే అతని కళ్లల్లో నీళ్లు! అది చూసి చలించిపోయి ఓదార్పుగా అతని భుజం తట్టాను.

" 'పెద్ద పెద్ద చదువులు చెప్పించటం తల్లిదండ్రులకు ఆశయం కావొచ్చు. కష్టాల్లో ఉండి కన్నీటి బ్రతుకులో ఉన్న నాలాంటి తండ్రికి ఆసరాగా నిలబడటం కొడుకుకి చిన్నతనం కాదు. మనలాంటి పేదవాళ్లకి పిల్లలే తరగని సంపద. నా కొడుకు నాకు చేయూతగా నిలవాలనే నా ఆశ. ఈ ఆశ సూర్యం తప్పకుండా తీరుస్తాడనే నమ్మకం నాకుంది" సూర్యం చెప్పటం పూర్తయింది.

అప్రమత్తంగా నా మనసు చెమ్మగిల్లిపోతోంది. కొంచెం సేపు మా ఇద్దరి మధ్యా నిశ్శబ్దం.

"సూర్యం, మీ నాన్నగారికి సాయపడటానికి నువ్వు చదువుకోకుండా, సంపాదిస్తూ కుటుంబాన్ని ఆదుకుంటున్నావు. ఇపుడు చదువుకోలేని నువ్వు... రేపు నీ పిల్లల చదువు సంగతి?" అనుమానంగా అడిగాను.

"అందుకే సార్, నా సంపాదనలో నాకు చేతనైనంత డబ్బు ఇప్పటి నుంచే దాచుకుంటున్నాను. మా నాన్నగారి అనుభవాలు నాకు పాఠాలు! ఈ నిజం గ్రహించటం కూడా ఒక చదువే కదండీ!"

సూర్యం మాటలకి నాలో ఆశ్చర్యం! నిజానికి అతను దాచుకుంటున్నది కేవలం డబ్బు కాదు, రేపటి తరాల వెలుగు! అవును. తరతరాల వెలుగుకి సూర్యం ప్రతీక!

అందుకే... అతను రేపటి సూర్యుడు!!!